# ముగ్గురన్నల ముద్దుల చెల్లెలు

"అమ్మగారూ! మీకు ఉత్తరం వచ్చిందమ్మా!" ఆఫీసు ప్యూన్ సరళకు ఉత్తరం అందించేడు. 'తనకి ఎవరు రాస్తారు? తనకి ఉత్తరం రాసేంతగా ఎవరకి గుర్తొచ్చిందట?' అని ఆలోచిస్తూ కవరు చింపింది. అది తన పెద్ద మేనల్లుడు రాసేడు. చదువుకొని సారాంశం గ్రహించిన సరళ ముఖం జేవురించింది. తను ఈ ఉత్తరమే టెలిగ్రాంగా భావించి ఉన్నపాటున రావాలా? ఓ రెండు వారాలు సెలవు పెట్టి మరీనా? ఉత్తరం హేండుబాగులో పడేసి తన పని చేసుకోసాగింది. అయినా ఆలోచనలు అంతరంగంలో జోరీగల్లా రొద పెడుతూనే ఉన్నాయి.

భాస్కర్ పెళ్ళయిన తరువాత ఇదే తనకి వ్రాయటం. ఓ ఆరునెలలు గడిచేయికదా? తన అవసరం వచ్చి ఉంటుంది. తను వెళ్ళకపోతేసరి. తనకి ఇంక ఓపిక లేదు. చెయ్యగలిగినంత కాలం చేస్తూనే వచ్చింది. ఇంక తను ఎవరిని గురించయినా ఎందుకు పట్టించుకోవాలి? ఎంతకాలం ఇలా?

ఇంటికి వచ్చినా ఆమె మనస్సంతా బరువుగానే ఉంది. 'టీ' కలుపుకొని త్రాగి, కుక్కరు పడేసుకొని ఓ వారపత్రిక తిరగేస్తూ కూర్చుంది. గతం నీడలు కళ్ళముందు కదులుతూ పత్రిక పైకి బుద్ధి పోనివ్వడం లేదు. దానిని ప్రక్కన పడేసింది.

★ ★ ★

పట్టరాని ఆనందంతో కాలేజీ జీవితం గురించి కలలు కంటూ యింటికి వచ్చింది సరళ. "సరూ! నీవు పదో తరగతి ఫస్టుక్లాసులో పాసయినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇంక నా చిట్టి తల్లి కళాశాల విద్యార్థిని అయిపోవాలి. ఇలాగే పట్టుదలతో చదువుతూ, కాలేజీకి కూడా మంచి పేరు తేవాలి!" అన్న నాన్నారి మాట నిజం చేసి తీరుతుంది. పట్టుదలతో చదివి పట్టభద్రురాలవుతుంది. అప్పుడు నాన్నారు ఇంకెంత ఆనందిస్తారో? అని తియ్యని ఊహలు తనను స్వప్న లోకాలలో తేల్చింది ఆ ఒక్కరాత్రి మాత్రమే!

మర్నాడు సూర్యం అన్నయ్య వచ్చి, "చెల్లాయ్! నిన్ను మా ఊరు తీసుకెళ్తునాను. బట్టలు సర్దుకో" అంటే ఆశ్చర్యపోయింది. "నే కాలేజీలో చేరాలిగా? నీతో ఊరొస్తే ఎలా అవుతుంది? వదిననే తీసుకొచ్చేయి. నాకూ మేనల్లుడిని చూడాలని ఉంది" అంది. "లేదమ్మా మీ వదిన వస్తే సెలవు పొడిగించాలి. బాబుకి కాస్త నలతగా ఉంది. పనివాళ్ళు సరిగా చూడరని బెంగపడుతోంది మీ వదిన. అందుకే నిన్ను తీసుకొని వెళ్తున్నాను. నాన్నగారితో చెప్పేను. సరే అన్నారు."

అన్నయ్య యింటికి వెళ్లింది.

"ఇదిగో రా, మీ అత్తమ్మ!" వదిన బాబుని వళ్ళో పెట్టేసరికి ముచ్చటేసింది. రెండు నెలల పసివాడు తన కళ్ళలోకి చూసి నవ్వేడు. పొంగిపోయింది. "అత్తతో అలా ఆడుకోవాలి. నేను ఆఫీసుకెళ్ళినా అల్లరి చేయకూడదు" అన్న, వదిన మాటలు తనకు అపుడు అర్థం కాలేదు. రోజులు నెలలుగా గడచిపోతున్నాయి. వదిన బాబుని చేరదీసేది కాదు.వాడు తనకే బాగా చేరికయ్యాడు.

పాలు పట్టడం, ఆడించటం, నిద్రపుచ్చటం, ముద్దుముద్దుగా ముస్తాబు చేసి, తోపుడు బండిలో షికారు తీసుకెళ్ళడం ఒకటేమిటి? అన్నీ తనే! తన దగ్గరే అన్నీ నేర్చుకున్నాడు. పాకుతూ ఇల్లంతా తిరుగుతూంటే ఎంతో మురిపెంగా ఉండేది. "అత్త!" అని మొదటిసారి వాడన్నరోజు తను ఎంత సంబరపడిందని? "మళ్ళీ అను, మళ్ళీ అను!" అని తను ముద్దులతో ఉక్కిరి బిక్కిరి చేసింది. అన్నావదినలకు ఆ సంగతి చెప్పి గర్వపడింది. పిల్లాడి బాధ్యతంతా ఆ అమ్మాయే చూసుకోవటం, వాళ్ళకి నిశ్చింతగా ఉంది. "అవునమ్మా! నువ్వు అత్తమ్మవి" అన్నాడు అన్నయ్య. "అవును సరూ! అందుకే మామయ్యగారు నిన్ను పంపించమంటున్నా, వీడు నీకోసం బెంగ పెట్టుకుంటాడని ఆలోచిస్తున్నా!"

నిజమే! నాన్నను చూసి 10 నెలలు దాటిపోతున్నది. తను అక్కడే ఉంటే ఈపాటికి తను కాలేజీలో చదువుతూ ఉండేది. కొత్త స్నేహితులు, కొత్త పుస్తకాలు భలే సరదాగా గడిపేదేమో! ఇక్కడ తనేమి చేస్తోంది? కేవలం బాబుని చూసుకోడం యింటి పనీ తప్ప! తన చదువు ఇలా మూల పడిందేమిటి? పెద్దగా వంటింట్లోంచి శబ్దం రాడంతో ఆలోచనలకు స్వస్తి చెప్పి, వంటింట్లోకి వెళ్ళింది. బాబు పెరుగు గిన్నె తిరగదోసేడు. వళ్ళంతా పూసుకొని ఏడవడం మొదలు పెట్టాడు. వాడికి మరోసారి స్నానం చేయించి, బట్టలు మార్చి భోజనం వడ్డించి, వదినను నిద్రలేపింది.

బాబు ఏడాది పుట్టినరోజు ఎంతో ఘనంగా చేసాడు అన్నయ్య. నాన్నారు కూడ ఎంతో ముచ్చటపడుతూ మరీ వచ్చారు. పెద్దన్నయ్యకు ఇద్దరూ ఆడపిల్లలే! వీడే వంశోద్ధారకుడు. అందుకే మరి నాన్నారికి ఆ సంబరం. గొలుసు, ఉంగరం, కీలుగుఱ్ఱం, అన్ని బహుమతులు తీసుకువచ్చి పొంగిపోయారు. తనకిమాత్రం నాన్నారిని చూడగానే దుఃఖం వచ్చింది. ఎవరి హడావుడిలో వాళ్ళున్నపుడు నాన్నగారితో తన గోడు వెళ్ళబోసుకుంది. "నాన్నా! నేను మీతో వచ్చేస్తున్నాను. చదువుకుంటాను. ఇలాగే రోజులు గడిచిపోతే, చదువు సంధ్య లేనిదాన్ని అయిపోతాను నాన్నా!" జాలిగా చూచింది. "అవును. ఎన్నాళ్ళిలా? సరళ వీళ్ళ దగ్గరుంటోంది. సంవత్సరం కావస్తోంది. ఉత్త పని పాటలతోనే పొద్దు పుచ్చుతోంది. పాపం! తన యింట్లో ఏ పని ముట్టుకోనివ్వడు. పుట్టగానే తల్లిని పోగొట్టుకుందని తనే తల్లీ తండ్రీ అయి పెంచాడు. ఎంత గారాబంగా పెరిగింది? ఇప్పుడే దీనికెందుకీ అవస్థలు?" తనని చూస్తూ నాన్న ఆలోచనలో పడగానే సరళ మనస్సులో ఆశ తళుక్కుమంది. అది నెరవేరింది కూడా! మళ్ళీ చిన్నన్నయ్య, నాన్నారు, తను. పగలంతా కాలేజీల్లో చదువుకొంటూ గడపడం, సాయంత్రం వేళ చిన్నన్నయ్యతో

షికారు వెళ్ళడం హాయిగా గడచిపోయింది. "ఎంతలో తను ఇంటర్ పూర్తిచేసేసింది! కాలం యింత తొందరగా పరుగులు పెడుతోందేమిటి?" అనిపించసాగింది.

తన ఆనందానికి మళ్ళీ బ్రేకు పడింది. "ఏం తల్లీ! బాధ్యత తీర్చేసుకోమంటావా? ఇంకా చదువు కొనసాగిస్తావా?" నాన్నగారి నోటికి చేయి అడ్డుపెట్టి, "ఇప్పుడే ఆమాట ఎత్తకు నాన్నా! నాకు యింకా చదువుకోవాలనుంది" అంది గోముగా. "ఆడపిల్ల అనగానే పెళ్లి, వంటిల్లు అంతేనా?" అంది.

"అంతేకాదు చెల్లాయ్! ఉంగా, ఉగ్గులూ కూడా" అంటూ రివ్వున దూసుకొస్తున్న శేఖరాన్ని చూచి, "అరె! నీ వెప్పుడొచ్చావురా?" అన్నారు నాన్న. "తండ్రీ కూతుళ్ళు తలుపులు కూడా వెయ్యడం మర్చిపోయి పెళ్ళిముచ్చట్లలో పడితే ఎవరు ఎప్పుడు వచ్చిందీ ఎలా తెలుస్తుంది?" తొలిసారిగా సరళ బుగ్గలు కెంపులయ్యాయి. "ఫో అన్నయ్యా!" బుంగమూతి పెట్టింది. "నేనొక్కత్తే ఎలా పోతాను? ఈ చిన్నారి చెల్లెమ్మను కూడా వెంట తీసుకొని మరీ వెళతానుగాని."

అన్నయ్య పరిహాసం సరళను భయపెట్టింది. "కొంపతీసి వీడు సూర్యం అన్నయ్యలాగే కొన్నాళ్ళు అట్టే పెట్టుకొంటానంటూ నాన్నారి దగ్గర అప్లికేషను పెట్టుకోడు కదా! అమ్మో, అలాగే జరిగితే తన చదువు చెట్టెక్కుతుంది."

కానీ, శేఖరం అన్నయ్య వచ్చింది అందుకే. సరళ అనుకున్నంతా అయింది.

శేఖరం అన్నయ్య భార్య తన స్నేహితురాలే కావడం, తనకెంతో ఇష్టమయిన నాట్యకళలో ప్రావీణ్యురాలు కావటం, ఆరోజు తనెంతో మురిపిస్తే, అదే తన చదువుకి విఘాతం కలిగించింది.

శోభ పేరు ప్రతిష్ఠలు తెచ్చుకొని పైదేశాలలో ప్రోగ్రామ్స్ యివ్వటానికి అక్కడివాళ్ళకి 'భారతీయ నాట్యరీతులు' నేర్పటానికి రెండేళ్ళు అమెరికా వెళుతోంది. తను యింటిని, పిల్లల్ని చూసుకోవాలి. తను కనుక కుదరదంటే వదిన వెళ్ళనే వెళ్ళదట. అంత తెగేసి చెప్పింది ప్రియ స్నేహితురాలు వదిన. శోభకి వచ్చే కీర్తి ప్రతిష్ఠలను ఆపటానికి మనస్కరించలేదు. నాన్నగారు మాత్రం అన్నయ్యతో గొడవపడ్డారనే చెప్పాలి. "డిగ్రీ పూర్తిచేయించి, నేను రిటైర్ అయ్యేలోగానే దాన్ని ఓ అయ్యచేతిలో పెట్టేస్తాను. ఏఁవఁనుకోకురా! నీతో పంపలేను." ఆ చిన్నమాటకు అన్నయ్యకి రోషం ముంచుకొచ్చింది.

"నాకు కాస్త చేదోడు వాదోడుగా ఉన్నంత మాత్రాన దానికేం పెళ్ళికాకుండా పోతుందా? చదువుమీద శ్రద్ధంటూ ఉంటే, ఎప్పుడైనా చదువుకోవచ్చు. దానికి అన్నయ్యనే కాని శత్రువుని కాను. మీలాగే దాని బాగోగులు నాకూ కావాలి. ఇష్టం లేకపోతే చెప్పండి. మీ కోడలే వెళ్ళడం మానుకుంటుంది."

ఆ వాదులాటలో తనే కల్పించుకొంది. "నేనేం రాననలేదుగా! నా చదువు సంగతి

నీవన్నట్టే ఎప్పుడో చూసుకోవచ్చులే! నాన్నగారితో పోట్లాటదేనికి?"

"నువ్వు వెళ్ళనంత మాత్రాన శోభ పై దేశాలు వెళ్ళటం మానుకోనక్కర లేదు. ఓ మనిషిని పెట్టుకుంటే సరిపోతుంది. ఇంటిపని, పిల్లల పని చూసుకొనేందుకు..." నాన్నమాట పూర్తికాకుండానే అందుకున్నాడు అన్నయ్య 'అయితే సరళని పనిమనిషి స్థానంలో తీసుకెళ్తున్నాననేగా మీ భావన? మీరిలా ఊహిస్తారని శోభకు నేను ముందే చెప్పేను. కాని తన మనస్సెప్పుడూ నా ప్రవర్తన ఎక్కడ మారిపోతుందోనని తెగ బాధపడుతోంది. ఆడపడుచు అడుగుపెడితేకాని ప్రయాణ సన్నాహాలే వీల్లేదంటూంది మీ కోడలు. కాదూ కూడదూ అని ఊరుకొంటే భార్యపైకి వస్తుంటే చూడలేకపోయాడని నలుగురూ నానా మాటలూ అంటారు. నువ్వేగా స్నేహితుడి కూతురంటూ అంటకట్టావు? అంతా నాఖర్మ! నన్నెవరూ అర్థం చేసుకోరు" విసురుగా వెనుతిరిగాడు అన్నయ్య. తనే బ్రతిమాలి, అన్నయ్య యింటికి వెళ్ళింది; కుటుంబ సభ్యుల మధ్య ఈ మోస్తరు కోపతాపాలు, రగడలు చోటుచేసుకోవడం యిష్టం లేక, అన్నావదినల పైనా, మేనకోడళ్ళపైనా మమత తెచ్చుకొని.

అయితే అక్కడ నిత్య వ్యవహారం తను అనుకున్నట్టుగా నడవలేదు. తనెంత లాలనగా చూసినా, అన్నయ్య ఆఫీసు నుండి వచ్చేసరికి ఏవో ఫిర్యాదులు చేసేవారు మేనకోడళ్ళు. ఒక్కొక్కసారి అతి చిన్న విషయాలే అన్నయ్య దృష్టిలో ఎంతో పెద్దవయిపోయేవి. భోజనం సరిగా చెయ్యమని, ఎప్పటికప్పుడు హోం వర్కు చేసుకోమని, ఈ మోస్తరు మందలింపులే వాళ్ళకి సాధింపుల్లా వేధింపుల్లా తోచేవి. ఎప్పుడూ లేనిపోనివే చెప్పేవారు. ఐస్‌క్రీంలు, కేకులు అత్తయ్యే తినేస్తుంది. మమ్మల్ని ఉత్త అన్నమే తినమంటుంది. అంటూ చాడీలు చెపుతుంటే "చూడు సరళా, వాళ్ళు చిన్న పిల్లలు. తల్లికి దూరంగా ఉన్నారు. ప్రేమతో చూడాలి కాని ఏడిపించుకు తినడం బావుండలేదు" అని అన్నయ్య అన్న రోజు మాత్రం తను కుమిలి కుమిలి ఏడ్చింది. అన్నయ్య వాళ్ళ మాటలే నమ్ముతాడు. తనని అర్థం చేసుకోడు. తను అన్నింటిని వదలుకొని వాళ్ళకోసమే యిక్కడకు వచ్చింది. ఇంటెడు చాకిరీ చేస్తుంది. వాడికి ఆ విషయమే తోచదేం? ఆ రెండేళ్ళు రెండు యుగాల్లా గడిచేయి. తలచుకొంటే ఆ గాయం రేగి తనని బాధిస్తుంది ఇప్పటికీ!

తనని ఆశయానుగుణంగా చూస్తాడనుకున్న చిన్నన్నయ్య మాత్రం ఏం చేశాడు? తన భవిష్యత్తుపై కట్టుకున్న పసిడి మేడలు ఒక్కసారిగా నేలమట్టం చేసాడు. అందమైన తన కలల లోకాన్ని శూన్యంగా మార్చేశాడు. ప్రతీ కన్నె తన కళ్యాణ శుభవేళ రావాలని, ఈడూ జోడైన వాడితో జీవితం పెనవేసుకొనీ, బ్రతుకు పండించుకోవాలనీ, పూజలు నోములు నోచినట్టే, తనను కూడా ఎంతో మురిపించిన ఆ వైవాహిక జీవితం దక్కకుండా చేసింది వాడేకదూ? తను వాడికేం అన్యాయం చేసిందనీ? ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి కూడా చేసేసుకొని "నాన్నా! మీ కోడలు!" అంటూ వెంట తీసుకొచ్చేడు. ఆవేశం ఆవేదన కలగలుపుగా నాన్నారు ఉగ్రరూపం ధరిస్తే తను శాంత పరచి, నచ్చ చెప్పి, కొత్త దంపతులకు హారతిచ్చి, ఆహ్వానించినందుకు

"నువ్వు దేవతవు చెల్లెమ్మా!" అంటూ ఆ రోజు ఆకాశానికెత్తేసాడు. ఆ అభిమానమంతా ఏమయిపోయిందో? అంత దారుణానికి ఒడిగట్టగలిగాడు....

నిజానికి చిన్నన్నయ్యంత స్వార్థపరుడు వుండడేమో అనిపిస్తుంది. తను డిగ్రీ పూర్తిచేయగానే వరాన్వేషణ మొదలు పెట్టేరు నాన్నారు. తన జీవితంలో పెళ్ళిచూపులు జరిగింది ఒకేసారి. వచ్చినవాళ్ళకి తనుబాగా నచ్చింది. ఆమాట వాళ్ళ నోట విన్నప్పుడు నాన్నగారి ఆనందానికి అవధుల్లేవు. తనూ ఎన్నో ఆశలల్లుకొంది. పిడుగుపాటులా వాళ్ళనుంచి వచ్చిన ఉత్తరం నాన్నగార్ని ఎంత కృంగదీసింది? అదంతా అన్నయ్య నిర్వాకమేనని తెలీటానికి సంవత్సరాలు పట్టింది....

తనకు పెళ్ళిచూపులు జరిగిన వెంటనే చిన్నవదిన నెల తప్పటం, ప్రేమ వివాహం చేసుకుందన్నకోపంతో పుట్టింటివారు ఆమెను ఆదరించకపోవటం, ప్రసవించే వరకూ అనారోగ్యంతో ఉండటం వల్ల వదిన ఏ పనీ చేసుకోలేకపోవడం తన అదృష్టాన్ని గ్రద్ద తన్నుకు పోయినట్టు తన్నుకు పోయాయన్నమాట. తనను అత్తారింటికి పంపాలని తపించే నాన్నగారు ఉన్నట్టుండి కన్నుమూసి తనని ఒంటరిదాన్ని చేసిపోయారు.

అతి ప్రయాసతో డిగ్రీ పూర్తిచేసింది. తను ఒక ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి వెళ్ళినపుడు అతనే గుర్తుపట్టి పలకరించాడు. ఆరోజు నుంచీ "మీరు నా మనసులో ఒక స్నేహితురాలిగా నిలిచిపోయారు" అంటూ మాటలు కలిపాడు. "మనం జీవిత భాగస్వాములం కావలసిందే! కానీ మీరే నన్ను తృణీకరించారు" అనేసరికి తనకు దుఃఖంతో పాటు ఆశ్చర్యం కూడా ముంచుకొచ్చింది. "అదేమిటీ! బాధ పడుతున్నారు? మీకు అప్పట్లో వివాహం చేసుకొనే ఉద్దేశ్యం లేదనీ, పల్లెటూరి జీవితం అంటే ఏవగింపనీ మీ అన్నయ్యగారితో రహస్యంగా కబురుపంపి, ఆ రహస్యాన్ని రహస్యంగానే ఉంచమని మరీ మరీ చెప్పేరటగా? దాని ఫలితమే మీ నాన్నగారికి మా నాన్నగారు వ్రాసిన ఉత్తరం" తనకు చిన్నన్నయ్య చేసిన ద్రోహం బయటపడింది. ఈ లోకంలో తనకెవ్వరూ లేరనిపించింది. అందరూ తమ తమ అవసరాలకు తనను ఉపయోగించు కున్నారు. అంతే! 'ముగ్గురన్నయ్యల ముద్దుల చెల్లి' అని తనను చిన్నప్పుడంతా తమాషాగా అనేవారు. కాని తనుపొందిందేమిటి; పెళ్ళిళ్ళకూ పేరంటాలకూ వెళ్ళొస్తూండటంతప్ప? అంతకన్నా అయిన వాళ్ళతో సంబంధాలు పెట్టుకోలేదు.

* * *

"ఏమిటీ, ఈ ఉత్తరం తనలో మరుగుపడిన జ్ఞాపకాలను తిరగ తోడుతోంది? ఇక్కడితో ఈ ఆలోచనలకు స్వస్తి చెప్పి భాస్కర్‌కో ఉత్తరం రాసి పడేయాలి" అనుకుంది.

* * *

తన ఉత్తరానికి తిరుగుటపా జవాబులాగా, సతీసమేతంగా ఊడిపడిన మేనల్లుడు భాస్కర్‌ని చూసి విస్తుపోయింది సరళ. "ఇదేవిట్రా! మీరు... మీరు?"

"ఏం! పిన్నీ! మీ యింటికి చుట్టాలెవరూ రాకూడదా?"

"అలాని కాదమ్మా!"

"నాకంతా తెలుసు పిన్నీ! ఎవరి మాట ఎలా ఉన్నా, మాకు మీ ఆదరాభిమానాలు కావాలి" అంటూ సరళ చెయ్యి పుచ్చుకొని తనే లోపలికి దారి తీసింది. తమ ఇద్దరి ఆలోచన ఆమెతో పంచుకుంది.

"ఇదేమిటమ్మా! ఎప్పుడైతే నా పెళ్ళి దిగులుతో నాన్నగారు వెళ్ళిపోయారో అప్పుడే నేను ఆ ఆలోచన మానుకున్నాను. నా గురించి ఇపుడు మీకు శ్రమ ఎందుకు? నాకిప్పుడొచ్చిన లోటు ఏమీలేదు" ఆమె పెదవులపై నిర్లిప్తమైన చిరునవ్వు.

"అలా కొట్టిపారేయకత్తమ్మా! ఇక నీవిలా ఉండటానికి వీల్లేదు. చిన్నప్పట్నించీ మా అందరికోసం నీ కాలాన్ని వెచ్చించావు. మమతలు పంచావు. నీ శ్రమను నాన్న, బాబాయిలు ఎవరు గుర్తించారు; నిన్ను గురించి ఎవరు పట్టించుకున్నారు? పైగా, కావాలని నువ్వే అందరికీ దూరమయ్యేవని అంటున్నారు. అందుకే మా ఈ నిర్ణయం. పద్మ బాబాయి చాలా మంచివాడత్తమా! నీలాగే తన వాళ్ళందరికోసం త్యాగం చేసి యిప్పుడు ఒంటరి అయ్యాడు. అతనికి నీతోడు అందించి నీ జీవితంలో లోటుదనాన్ని నింపుకో!"

భాస్కర్‌కి తన పట్ల ఉన్న ఆపేక్షకి సరళ కరిగిపోయింది. "ఎంత ఎదిగిపోయేవురా!" అంటూ ఆనంద భాష్పాలు నిండిన కళ్ళతో చూస్తూ ఉండిపోయింది. ఆ క్రొత్త దంపతులకు, ఆ క్షణాన సరళ నవ వధువులా కన్పించింది. "ఆడపిల్ల అరిటాకు మాత్రమే కాదు. మమతల తోరణానికి మామిడాకు. తన వాళ్ళకు పచ్చదనాన్ని పంచి, వేలాడి వాడిపోతుంది. అత్తమ్మ విషయంలో తనవాళ్ళు చేసిన పొరపాటును తామిద్దరూ ఈ విధంగా సరిదిద్ద గలిగారు" సంతోషపడ్డాడు భాస్కర్.

●

*(ఆంధ్రభూమి వీక్లీ - 21-5-98)*